ఇతి శ్రీ మహర్షి రమణభగవత్ పాదాన్తేవాసినో వాసిష్ఠస్య
నారసింహసూనోః గణపతిమునేః కృతౌ ఉమాసహస్రే
అష్టమః స్తబకః సమాప్తః।
సమాప్తంచ ద్వితీయమ్ శతకమ్

ఇది శ్రీ మహర్షి - రమణ భగవత్పాదశిష్యుడు,
శఠమర్షణసగోత్రుడు,
శ్రీ మత్పంతుల పేరయశాస్త్రిపౌత్రుడు, వెంకటరామ
బుధేంద్రపుత్రుడు అగు లక్ష్మీనారాయణ శాస్త్రిచే
నాంధ్రీకరింపఁబడిన యుమాసహస్రమను స్తోత్ర
కావ్యమున ద్వితీయ శతకము
శ్రీ శ్రీ శ్రీ

****

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

ఉమాసహస్రము

(తృతీయ శతకమున - ప్రథమ స్తబకము)

నవమ స్తబకము

అవ:- ఈ స్తబకమున - మహా ప్రభావమును, సర్వాతిశాయి రామణీయకమును అగు ఉమాదేవి మందహాసము - భంగీభేదమున స్తుతింపఁబడుచున్నది.

మూ॥ శారదవలక్షపక్షక్షణదా వైమల్యశిక్షకోఽస్మాకమ్।
జాగర్తు రక్షణాయ స్థాణుపురన్ధ్రీముఖ వికాసః ॥ 1

శరత్సమయమందలి శుక్ల పక్షరాత్రులకు వైమల్య శిక్షకమగు (నిర్మలతను గఱపునదియగు) స్థాణుపురంధ్రీ ముఖ వికాసము - మమ్ము రక్షించుటకు జాగరూకమగుఁగాత!

ప్రభ:- వైమల్య శిక్షకమన, నైర్మల్యమును బోధించునది (అధ్యాపకము) అని యర్థము.

జ్యోత్స్నా వైమల్యము కంటెనుగూడ ముఖవికాస ప్రకాశ మధికమని భావము. స్థాను పురంధ్రీముఖ వికాసమన, శివసుందరీ మందహాసమని యర్థము.

ఇందలి శిక్షక శబ్దము సాదృశ్యసూచకము. కావున వెన్నెలయొక్క వైమల్యమునకును, ఉమా ముఖ వికాసమునకును గల ప్రకాశకతా సాధర్మ్యము వలన నిది యుపమాలంకారమగుచున్నది. దండ్యాచార్యుఁడు ప్రతి పక్షాదిశబ్దములు

సాదృశ్య సూచకములనియు, కవుల బుద్ధిసౌఖ్య ప్రదములగునవి ఉపమయందు ప్రయోగార్హములనియు చెప్పి యుండుటవలన – ఇందలి శిక్షకశబ్దము సాదృశ్యసూచకమగుటయు, తత్ ప్రయోగము వలన నిది యుపమయగుటయు సంగతమేయని యెఱుంగునది.

మీఁది శ్లోకమునందలి ''జాగర్తు'' (జాగరూకమగుగాత!) అనుపదము – ముఖ వికాసముచేఁ జేయఁదగిన రక్షణ క్రియను ప్రకర్షింపఁజేయును. తత్పదార్థ సామర్థ్యమువల న 'ముఖవికాసము – బోధరూపము' అనునర్థము ఆక్షేపింపఁబడును. (తీసికొని రాఁబడును) చీకటియందుఁగాని, జడతయందుఁగాని భయమువలన రక్షింపఁదగిన భక్తులకు ఉమా ముఖవికాసము యొక్క జాగరణమే (మేలుకొని యుండుటయే) గొప్ప త్రాణముగదా!

అదెట్లనిన:– గాఢాంధకారము వ్యాపించి యుండునపుడు గాని, లోకము నిద్రించియున్నపుడుగాని, చరాచరశత్రువగు భయము కలుగునపుడు దానిని తొలఁగించుటకు వెలుతురు గాని, ఒకానొక బలవంతుని జాగరణముగాని సమర్థమగుచుండును. అట్లే – చరాచర శత్రువులగు భయముల నుండి రక్షింపఁదగిన భక్తులను, రక్షంచుటకు భగవతి యొక్క చిత్ ప్రకాశాత్మకమగు ముఖ వికాసము యొక్క జాగరణ మాత్రమే చాలియుండునని భావము. ఆయమ్మయే గదా చరాచరనియంత్రన సమర్థయై యెల్లయెడలను మేలుకొనియున్నది!

ఈ యంశము శివశతకము నందీయాచార్యుని చేతనే ఇట్లు చెప్పఁబడినది.

''సర్వస్మిన్న చరేచరేచ విభవాదే కాపరా జాగ్రతీ!
శక్తిన కాచన సావిచార రసికై రారాధ్యతే నాథతే.''

'ప్రభూ! చరాచరమగు నీవిశ్వమున అనిర్వాచ్యయగు నీపరాశక్తి మహావైభవముతో మేల్కొనియున్నది. ఆనీ శక్తిని విచార రసికులు సమారాధింతురు.'

మూ॥ వ్యాఖ్యానం హర్షస్య ప్రత్యాఖ్యానం శరత్సుధాభానోః
దిశతు హృదయప్రసాదం గౌరీవదన ప్రసాదో నః ॥ 2

హర్షమును వ్యాఖ్యానించునదియు, శారదచంద్రుని ప్రత్యాఖ్యానించు నదియు, అగు గౌరీముఖ ప్రసాదము మాకు హృదయప్రసాదము నొసఁగుఁగాత!

ప్రభ:- హర్షమును వ్యాఖ్యానించునది యనఁగా, ఆయుమకు సహజమగు సంతోషమును వివరించునదియని యర్థము. ప్రత్యాఖ్యానించునదియన, తిరస్కరించునదియని యర్థము. శరచ్చంద్రునికంటెను గూడ నిర్మలమని భావము.

మీఁది విశేషణద్వయము వలన – ఉమాముఖ ప్రసాదమునకు సంతోషావహత్వము – నైర్మల్యావహత్వము చెప్పఁబడినవి. తదుభయప్రదానముచే హృదయ ప్రసాదలాభము సిద్ధమగును. కావున – సంతోషావహత్వ – నైర్మల్యావహత్వ – ప్రదానసమర్థమగు, ఉమావదనప్రసాదము ప్రార్థింపఁబడినది.

ఇందు ఒక్కటియేయగు ఉమాముఖ ప్రసాదము హర్షమును వ్యాఖ్యానించునదిగను, శారదచంద్రుని ప్రత్యాఖ్యానించునదిగను, (ద్వివిధముగ) ఉల్లేఖింపఁబడుట వలన నిది ఉల్లేఖాలంకారమగుచున్నది.

మూ॥ అన్తర్గతస్య హర్షక్షీర సముద్రస్య కల్పనతరఙ్గః
హాసో, హరహరిణదృశో గత పఙ్కం మమకరోతుమనః ॥ 3

హృదయాంతరగతమగు హర్ష క్షీరసముద్రము యొక్క తరంగ విశేషమగు పార్వతీహాసము నామానసమును గతపంకముగా – పాపము లేనదిగా; లేక బురదలేనిదిగా, నొనర్చునుగాత!

ప్రభ:- 'హర్ష క్షీరసముద్రమన' సమ్మదమనెడి క్షీరమయమగు సముద్రము. గతపంకము = పాపములేనిది.

ఇందు ఆరోపవిషయ – విషయులగు హర్ష – సముద్రములకును, హాస – తరంగములకును అభేదాధ్యవసాయము వలన రూపక మలంకారమగుచున్నది. 'పాపము బురద' అను నర్థములు గలది కావున పంకము శ్లిష్టార్థము గలిగియున్నది. సముద్రపు కెరటముల చేత బురద తొలఁగునట్లు, పార్వతి చిరునవ్వుచేత పాపము తొలఁగునని భావము. పంకపదమునకుఁగల శ్లిష్టార్థ సామర్థ్యమువలన మనస్సు – పంకిలమగు (బురదతోఁగూడిన) సరస్తటము వంటిదనునర్థ మాక్షేపింపఁబడుచున్నది.

మూ॥ దిశిదిశివిసర్పదంశు ప్రశమితతాపం పరాస్తమాలిన్యమ్
కుశలాని ప్రదిశతునః పశుపతిహృదయేశ్వరీహసితమ్ ॥ 4

సర్వదిశలయందును ప్రసరించుచున్న కిరణములచేత తాపము నడఁగించునదియు, (శిశిరీకరించునదియు) మాలిన్యమును తొలగించు నదియునగు పశుపతి హృదయేశ్వరీహసితము – మాకు కుశలముల నొసంగును గాత!

ప్రభ:- పశుపతియన భూతముల కధిపతియగు నీశ్వరుఁడు. అతని హృదయేశ్వరి పార్వతి. ఆమె చిరునవ్వు – పశుపతి హృదయేశ్వరీహసితము. కుశలములన క్షేమములు. తాపప్రశమన – మాలిన్యపరాసనముల చేత, హసితమునకు అమృతకిరణత్వము – వ్యంజింపఁజేయఁబడుచున్నది. దానిచేత నిచట – ఉపమ – ధ్వనించుచున్నదని తెలియునది.

మూ॥ అన్తర్గతంచతిమిరం హరన్తి, విహసన్తి రోహిణీకాన్తమ్!
హసితాని గిరిశసుదృశో మమ ప్రబోధాయకల్పన్తామ్॥ 5

హృదయగతమగు తిమిరమును గూడ హరించునవియు, రోహిణీ కాంతునిగూడ విహసించునవియునగు కైలాసనాథ సుందరి హసితములు మమ్ము ప్రబోధించునుగాత!

ప్రభ:- తిమిరము = చీకటి. రోహిణీకాంతుఁడు = చంద్రుఁడు. చంద్రుఁడు వెలుపనున్న చీకటినే తొలఁగించునుగాని హసితములు – లోపలనున్న చీకటిని గూడ తొలఁగించును గావుననే, హసితములు వానిని పరిహసించునని భావము.

ఇచట ఉపమానమగు రోహిణీ కాంతునికంటె నుపమేయములగు హసితముల కాధిక్యము వర్ణింపఁబడియెను. '' ఉపమానముకంటె నుపమేయమున కాధిక్యముగాని న్యూనతగాని చెప్పఁబడినయెడల నది వ్యతిరేకాలంకార మగును'' అను సాహిత్య దర్పణోక్తమగు లక్షణమున నిది వ్యతిరేకాలంకార మగునని గ్రహించునది.

మూ॥ భూషాతుషారధీధితి ధీధిత్యాసహవిహాయసో రఙ్గే
విచరన్ పురహరతరుణీ దరహాసో మేహరత్వేనః ॥ 6

శివశిరోభూషణమగు చంద్రుని చంద్రికతోఁగూడి ఆకాశరంగమున విహరించుచున్న పురహరతరుణీ దరహాసము నా పాపమును బాపునుగాత!

ప్రభ:- ఆకాశరంగమున అనుచోట ఆకాశమేయగు రంగస్థలమున, (నాట్య స్థలమునందు) అను నర్థము నెఱుఁగునది (రాహువేయగు శిరస్సు – రాహువు యొక్క శిరస్సని చెప్పఁబడినట్లు, ఆకాశమేయగు రంగస్థలము – మూలమున ''విహాయసోరఙ్గే'' = '' ఆకాశముయొక్క రంగస్థలమున'' అని చెప్పఁబడినదని యెఱుంగునది.

ఆకాశరంగమున కాంతునిగూడి విహరించుచున్న ఉమామందహాసము – హరశిరోభూషణ – బాలచంద్ర – చంద్రికతోఁగూడ విలసిల్లుచు నాపాపమును తొలఁగించును గాత యని ప్రార్థింపఁబడినది.

ఇచట అనురూపములగు ఉమామందహాసబాల చంద్రికలు వర్ణింపఁబడినవి. కావున నిది సమాలంకారమగుచున్నది.

మూ॥ రుద్రాణీ దరహసితాన్యస్మాకం సంహరన్తు దురితాని
యేషాముదయో దివసో భూషాపీయూష కిరణస్య ॥ 7

ఏ దరహసితోదయము - హరశిరోభూషణమగు నమృతకిరణునకు దివసమగుచుండునో (చంద్రుని తిరస్కరించునో) ఆ రుద్రాణీ దర హసితములు మాదురితములను హరించుఁగాత!

ప్రభ:- దివసము = పగలు, పగటియందు చంద్రప్రభ - తగ్గిపోవుట ప్రసిద్ధము కావున ఆ చిరునవ్వు - పొడమగనే, శివశిరశ్చంద్రిక - తిరస్కరింపఁబడినట్లు, చెప్పబడినది.

''దివసము'' అను పదముయొక్క అర్థసామర్థ్యము వలన హసితములకు, ప్రతాపగర్భమగు ఉష్ణరశ్మిత్వము (సూర్యత్వము) ఆక్షేపింపఁబడినది. తదానుగుణ్యమున దురిత - సంహరణ - ప్రార్థనకూడ నౌచిత్యమును పోషించుచున్నది.

ఉమాహసితములకును - శిరోభూషణ బాలచంద్రునకును గూడ కాంతి - సమానమేయయినను దివసపదము చేత హసితప్రభకుత్కర్షమును, బాలచంద్ర ప్రభకు నికర్షమును గమింపఁజేయఁబడుట వలన బాలచంద్రప్రభకు తిరోధానము చెప్పఁబడినది. కావున ''నికృష్టమగు వస్తువున కుత్కృష్టమగు వస్తువుచే నగు తిరోధానము మీలితము'' అను లక్షణము చేత నిది - మీలితాలంకారమగుచున్నది.

మూ॥ స్కన్దజననీముఖేన్దో రస్మాన్పుష్ణాతు సుస్మితజ్యోత్స్నా
మునిమతికైరవిణీనా ముల్లాసకథా - యదాయత్తా॥ 8

ముని - మతులను (హృదయములను) కుముదినులకు (కలువలకు) వికాసమును గలిగించుట - దేనిక ధీనమైయున్నదో సుబ్రహ్మణ్యుని తల్లియగు పార్వతి యొక్క ముఖచంద్రునికి సంబంధించిన శుభప్రదమగు ఆ చిరునవ్వువెన్నెల మమ్మపోషించుఁగాత!

ప్రభ:- ఇందలి యలంకారము - రూపకము. స్కందజననియన, కుమారస్వామి యొక్క తల్లి, మత శబ్దమున కిచటను మాత్రము హృదయమని యర్థముఁ జెప్పనగును. ఇందు పార్వతీముఖము - చంద్రస్థానీయము. చిరునవ్వు - జ్యోత్స్నాస్థానీయము. మునిమతులు - కైరవిణీస్థానీయములు.

ఉల్లాసమును గలిగించుట - స్మితాధీనము - ఉల్లాసశబ్దస్వారస్యము వలన మీది శ్లోకమునందలి మతిశబ్దము హృదయమునకు పలక్షకమని యెఱుంగునది.

''సనత్కుమారుఁడు'' అనునామాంతరము గల స్కందుఁడు మృదితకషాయులగు మునులందఱికంటెను గూడ జ్ఞానదాత'' అను ప్రసిద్ధి యున్నది. కావున ముని హృదయోల్లాస ప్రసంగము వలన, పార్వతని దెలుపుచున్న స్కందజననీపదమిచట నౌచిత్యపోషకమగుచున్నది.

మూ॥ కమనీయకణ్ఠమాలా ముక్తామణితారకావయస్యోనః
కామాన్వితరతు గౌరీదరహాసో నామ ధవలాంశుః ॥ 9

మనోజ్ఞమగు కంఠమాలయందలి ముక్తామణులను తారలకు వయస్యుఁడగు గౌరీదరహాసమను ధవలాంశుఁడు, మాకు వాంఛితముల నొసంగునుగాత!

ప్రభ:- తారలకు - నక్షత్రములకు, ధవలాంశుఁడు = చంద్రుడు, (తెల్లని కిరణములు గలవాఁడు) కంఠమాలాముక్తామణులయందు ప్రభాతరలతా సాధర్మ్యము వలన తారకారోపణము! చేయఁబడినది. దరహాసము - ముక్తామణులకువయస్యుఁడు (సహచరుఁడు) చంద్రుఁడు - తారావయస్యుఁడు (కాంతుఁడు)

శోభావహత్వము - ఆహ్లాదకత్వము మొదలగునది - దరహాస ధవలాంశువులకు సమానధర్మము. కావున నిదియిట్లు - సావయవరూపకాలంకార మగునని గ్రహించునది.

మూ॥ అనవద్యకణ్ఠమాలా ముక్తావలికిరణ నివహసహవాసీ
హరదయితా దరహాసో హరతుమమా శేషమజ్ఞానమ్॥ 10

కంఠమాలయందున్న నిర్దుష్టమగు ముక్తావలియొక్క కిరణసమూహమునకు సహవాసియగు (మిత్రమగు) హరదయి తాదరహాసము నా యజ్ఞానమునంతను హరించుఁగాత!

ప్రభ:- హరదయితయన శివకాంతయని యర్థము. భక్తుల యజ్ఞానమును గాని ఆర్తినిగాని హరించును గావున శివుఁడు హరుఁడగుచున్నాఁడు.

ఇచట నిశ్శేషమగు – అజ్ఞానహరణము – ప్రార్థింపఁబడినది కావున పార్వతిని హరదయితగా కీర్తించుట – ఔచిత్యపోషకమగుచున్నదని గ్రహించునది.

మూ॥ ఞ ఇవజ్ఞదృశ్య ఉత్తమ - ఇలాధరాధీశనన్దినీహాసః।
పూర్ణం కరోతుమానస మభిలాషం సర్వమస్మాకమ్॥ 11

జ్ఞ దృశ్యమగు (జ కా ర జ కారసంయోగమగు 'ఞ' అనుదాని యందు జూడఁదగిన) ఞ కారమువలె ఉత్తమమగు (ఉత్కృష్టమగు) పర్వతరాజపుత్రీహాసము, మాయొక్క మానసమగు అభిలాషమును సర్వమును పూర్ణము గావించునుగాత.

ప్రభ:- మూలమునందలి '' ఇలాధరాధీశ నన్దినీహాసః'' అను పదమునకు తెలుఁగున, పర్వతరాజపుత్రీహాసమని యర్థము చెప్పఁబడినది.

(జ్ఞ) అను లిపియందు (ఞ) కారము సరిగా గుర్తింపఁబడనేరదు; కాని అత్యంతమును సూక్ష్మమగు దృష్టిచేతఁ జూడఁబడును.

ఇట్లు – అవి స్పష్టముగను సూక్ష్మముగను గుర్తింపఁదగిన (ఞ) వర్ణమువలె సరిగా గుర్తింపబడకుండుటవలనను సూక్ష్మమగుటవలనను గూడ పార్వతీహాసము. ఉత్తమమని చెప్పఁబడినది.

తైత్తిరీయ ప్రాతిశాఖ్యమున (ఞ) కారము – ''ఉత్తమము'' అనుసంజ్ఞ గలదని యిట్లు పఠింపఁబడినది.

సూ॥ 10, వర్ణానామానుపూర్వేణ పఞ్చ పఞ్చ వర్గాః॥

సూ॥ ప్రథమ – ద్వితీయ – తృతీయ – చతుర్థ – ఉత్తమాః

ఇట్లు ఉత్తమసంజ్ఞమగు ఞ వర్ణము జ్ఞదృశ్యము = ప్రాతిశాఖ్యజ్ఞులచేఁ దెలియఁదగినది. అట్లే – ఉత్తమమగు పార్వతీహాసముకూడ జ్ఞదృశ్యము = పండితులచేఁ దెలియఁదగినది.

మూ॥ ఆలోకమాత్రతోయః శఙ్కరమసమాస్త్రకిఙ్కరం చక్రే
అల్పోఽప్యనల్పకర్మాహాసో నః పాతు స శివాయాః॥ 12

ఆలోకమాత్రమున శంకరుని విషమాస్త్రకింకరు నొనర్చునదియు అల్పమయినను అనల్పమగు కర్మగలదియునగు పార్వతి చిరునవ్వు – మమ్ము రక్షించునుగాత.

ప్రభ:- ఆలోక మాత్రమున = చూచినంత మాత్రముచేతనే, విషమాస్త్రకింకరుఁడు = పంచబాణుఁడగు మన్మథునకు వశపడినవాఁడు, అనల్పమగు= అధికమగు.

వివ:- పార్వతీహాసమును దర్శించినంతమాత్రము చేతనే శంకరుఁడు మదన వశంగతుఁడయ్యెనని భావము.

హాసము – స్వల్పమైనను, స్వదర్శనమాత్రమున శంకగుని కామకింకరుని జేయుట – అనల్పమగు కర్మయై యున్నది. కావున నిట్లు – అసంభావ్యత్వవర్ణనము వలన అసంభవమును వర్ణించుటవలన నిది – అసంభవమను అలంకారమగుచున్నది.

మూ॥ స్మర - మతరతమీశంయః కరోతిభావప్రసఙ్గచాతుర్యా।
ద్విజగణపురస్కృతోఽ వ్యాత్ స శివాహాసప్రవక్తానః ॥ 13

భావ – ప్రసంగ – చాతురిచేత ఈశ్వరుని కామతంత్రరతు నొనర్చినదియు, ద్విజగణముచేత పురస్కరింపఁబడినదియు, నగు పార్వతి యొక్క హాసమను ప్రవక్త మమ్ము రక్షించుఁగాత.

ప్రభ:-బ్రాహ్మణవర్గమును ముందుంచుకొని (పూజించి) నిజాభిప్రాయమును స్ఫుటీకరించు చాతుర్యముగలిగి – ఉపన్యాసమును జెప్పువాఁడగు ప్రవక్తవలె – దంతపంక్తిని వెనుకనుంచుకొని – విభావాదుల చేత నిష్పాదింపఁదగిన రతిభావమును దెలియఁజేయు చాతుర్యముగలిగి – ప్రకాశించుచున్న పార్వతి చిరునవ్వు మమ్ము రక్షించుఁగాత మని భావము.

ప్రవక్తయన బాగుగా చెప్పువాడు (ఉపన్యాసకుఁడు) ఇందు పార్వతీ హాసము ప్రవక్తగా నారోపింపఁబడినది. కావున మీఁది విశేషణములు హాస పక్షమునను ప్రవక్త పక్షమునను గూడ క్రమముగా నిట్లు సమన్వయింపఁదగియున్నవి.

భావప్రసంగచాతురి చేత = రసాదినిష్పాదకమగు రత్యాదిభావము యొక్క ప్రస్తావ విషయమునందలి నిపుణత చేత, లేక అభిప్రాయము యొక్క ఆవిష్కరము నందలి చతురత చేత – ద్విజగణము చేత పురస్కరింపఁబడినది – దంతపంక్తికి ముందుగా స్థాపింపఁబడినది – లేక బ్రాహ్మణ గణమును ముందుగా పూజించినది.

ఈ శ్లోకము – ఇట్లు శ్లిష్టార్థము కావున నిందలియలంకారము – శ్లేషోత్థాపితమగు సావయవ రూపకమగుచున్నది. 'భావప్రసంగ చాతురిచేత' అని చెప్పుట చేత ''శృంగారరస నిష్పాదకములగు – ఆలంబన – ఉద్దీపనవిభావ – అనుభావాదుల చేత నిష్పాదింపఁదగిన రతిభావము – కామేశ్వరి మందహాసగర్భము'' అను నంశము ద్యోతింపఁజేయఁబడుచున్నది.

''పురస్కృతః = ముందుంచు కొనఁబడినది'' అనుటచేత వెనుకనున్నదంత పంక్తి, స్పష్టముకాని, దర్శనము గలదనియు ముందున్నహాసము (స్వల్పమైనను) సుస్పష్టమగు దర్శనము గలదనియు గమ్యమగుచున్నది. హాసమునందు ప్రవక్తృత్వము నారోపించుట వలన ప్రవచన కార్యమంతయును గూడ వాగ్ విరహితమగు హాసము చేతనే నిర్వహింపఁబడినదని విశదమగుచున్నది.

మూ॥ రథవాససారథీమాం శరీకరైః పాతు పార్వతీహాసః
పావకదృశంజిగీషోః పఞ్చపృషత్కస్య సేనానీః ॥ 14

దంతపంక్తిని గప్పుచున్న యధరము చేత – రథియు (రథముగలదియు) కిరణముల చేత – శరియు (బాణముగలదియు) జ్వలననేత్రుఁడగు శివుని జయింపఁగోరిన పంచబాణునకు సైనికాధిపతియు, అగు పార్వతీహాసము – నన్ను రక్షించునుగాత!

ప్రభ:- ఇందు – అధరమను రథముగలదియు, కిరణములను బాణములు గలదియు – అని సమాన విభక్తులచేఁగాక ''అధరము చేత – రథియు, కరములచేత – శరియు'' అని భిన్న విభక్తుల చేనగు అభేదాధ్యవసాయము వలన నిది – వైయధికరణ్యము చేత నగు రూపకమగుచున్నది. అనల నేత్రుఁడగు శివుని జయించుటకు మన్మథుఁడు ప్రయత్నించునపుడు భగవతియగు పార్వతి యొక్క సుందరహాసమే యుద్ధసన్నాహ మొనర్చు సైన్యాధిపతివలె విజయమును నిర్వహించినది.

కావున నది సైనికాధిపతియని చెప్పఁబడినది. అధరము – హాసమును వహించినది, ఆయధరమున ధరింపఁబడిన హాసమయూఖములే – బాణములయినవి. హాసము – రథియయినది. రథియగుహాసమే మన్మథుని సేనాధిపతి యయినది.

ఇట్లు – వర్ణింపఁబడిన మందహాసమహిమ – (రూపక సామర్థ్యమున) సర్వోత్తరమగు రామణీయకమును పోషించుచున్నది.

మూ॥ శివ హృదయమర్మభేది స్మితం తదద్రీశ వంశముక్తాయాః।
దశనద్యుతి ద్విగుణితశ్రీకం శోకం ధునోతు మమ. 15

మహేశ్వర హృదయమర్మమును భేదించునదియు, దంతకాంతులచే ద్విగుణితమగు శోభగలదియు, నగు పర్వతరాజ వంశముక్తామణి ముఖమునందలి యాచిరునవ్వు మా శోకమును పోకార్చుఁగాత!

ప్రభ:- మర్మమన, గూఢమగు జీవస్థానము, ద్విగుణితమన, రెట్టింపు చేయఁబడినది. వంశమన – కులము, వెదురు. (వెదురునందు మౌక్తిక ముదయించుననునది కవి సంప్రదాయము. ప్రగాఢమగు శివహృదయమునందుఁగూడ చొరఁబడిన పార్వతీ స్మితము, అస్మదాదుల హృదయమునఁ బ్రవేశించి, తద్గతమగు శోకమును తొలఁగించుటకు శక్తము కానేరదా ? అని భావము.

మూ॥ బ్రహ్మాణ్డరఙ్గ భాజో నట్యాః శివసూత్రధారసహచర్యాః
శ్రీ వర్ధనో ఽను లేపో ముఖస్యహాసః పునాత్వస్మాన్॥ 16

బ్రహ్మాండమను రంగస్థలమున ప్రవేశించిన శివుఁడనుసూత్రధారునకు సహచరి (సఖి) యగు పార్వతి యొక్క శ్రీ వర్ధనమగు అను లేపమేయగుహాసము మమ్ము పవిత్రుల నొనర్చుఁగాత!

ప్రభ:- రంగమన, నాట్యస్థలము, సూత్రధారుఁడన భరతాచార్యుఁడగు నటుఁడు. సూత్రధార సహచరి యన నతని ననుసరించునటి. శ్రీవర్ధనమన, శోభా ప్రకర్షకము. అను లేపనమన లేపనద్రవ్యము – ముఖమునకుఁ బూసికొనురంగు (పౌడరు) బ్రహ్మాండము – రంగస్థలము. శివుఁడు – సూత్రధారుఁడు తత్ సహచరియగు పార్వతి – నటి, పార్వతీముఖహాసము – నటీముఖశోభను వృద్ధినొందిచు పౌడరు అని యెఱుంగునది. సావయవమగు రూకము – అలంకారము.

మూ॥ అధర ప్రవాళశయనే నాసాభరణ ప్రభావిలాసిన్యా
రమమాణోహరరమణీ హాసయువా హరతు నఃశోకమ్॥ 17

అధర – ప్రవాళ – శయనము నందు నాసాభరణ ప్రభావిలాసినితోఁగూడి– రమించువాఁడగు హరరమణీ – హాసయువకుఁడు మాశోకమును తొలఁగించునుగాత!

ప్రభ:- అధర ప్రవాళశయనమునందు – మోవియను చిగురాకు చేతఁగూర్పఁడిన పాన్పునందు, నాసాభరణప్రభా విలాసినితోఁగూడి = ముక్కు ముత్తెపు కాంతియును విలాసవతితోఁజేరి, హరరమణీహాసయువకుఁడు = పార్వతీహాస మనుయువకుఁడు రమించుచున్నట్లు చెప్పఁబడినది. ఇందు – రూపకమలంకారము. కవిప్రౌఢోక్తి సిద్ధమగు ఈ యలంకారముచేత – నాసాభరణప్రభావిలాసినీ – హాసయువకులకు – అధరశయనమున, అన్యోన్యమగు కలయిక – లోకోత్తర శోభావహమను నంశము వ్యంజింపచేయఁబడుచున్నది.

మూ॥ అధరోష్ఠవేది కాయాం నాసాభరణాంశు శాబకైః సాకమ్
కులమఖిలమవతు ఖేలన్నద్రిసుతా హాసబాలోనః॥ 18

అధరోష్ఠమగు వేదికయందు నాసాభరణకాంతులను శాబకులతోఁ గూడి యాడుచున్న హైమవతీహాసమను బాలుఁడు మాకులమును సకలమును రక్షించుఁగాత!

ప్రభ:- అధరోష్ఠమన, క్రింది పెదవి. శాబకులన, శిశువులు. వేదికయన, గృహ ద్వారమున కీవల నించుకయెత్తుగా నిర్మింపఁబడిన యరుగు. అది బాలు కాటస్థలవుగుచుండును. ఈ రూపకమునందుఁ గ్రిందియంశము లెఱుఁగఁదగియున్నవి. నాసాభరణకాంతులు = ఆడుకొనుటకు వచ్చిన యితరశిశువులు. అధరోష్ఠము – క్రీడాస్థలమగు వేదిక. ఇట్లు – కవిప్రౌఢోక్తి సిద్ధమగు రూపకము చేత – బాలుడు – శిశువుల కంటె నధికుఁడు. కావున బాలుఁడుగాఁ చెప్పఁబడిన హాసము శిశువులుగాఁ జెప్పఁబడిన భూషణాంశువులతోఁ గూడి యథేచ్ఛముగా విలసిల్లుచున్నను ''దానిశోభ – సర్వోత్తరమే'' అను వస్తువు ధ్వనితమని తెలియునది.

మూ॥ అనులేపనస్య వీప్సా ద్విర్భావః కుచతటీదుకూలస్య।
హరతుహృదయవ్యథాం మే హసితంహరజీవితేశ్వర్యాః॥ 19

అను లేపమునకు ద్విరుక్తియు, కుచతటీదుకూలమునకు ద్విరా వృత్తియునగు హరజీవితేశ్వరి యొక్క హసితము – నాహృదయ వ్యధను తొలఁగించునుగాత.

ప్రభ:- పార్వతి యొక్క చిరునవ్వు సొంపును గూర్చునదియగు మంచి గంధము మున్నగు లేపన ద్రవ్యమునకు మీఁద నింకొక అనులేపనమును ఉత్తరీయమునకు మీద నింకొక యుత్తరీయమును అగుచున్నదని తాత్పర్యము.

మూలమునందు 'వీప్సా' అను పదమునకు ద్విరుక్తియని యర్థమగుచున్నది. మూలమునందలి ద్విర్భావ పదమునకు ద్విరావృత్తి యర్థమగును. అనులేపనమన మంచి గంధము మొదలగు శోభాదాయకమగు లేపన ద్రవ్యము. శుభ్రత్వసాధర్మ్యమువలన ఉమాహసితము – అనులేపనము మీఁద అనులేపనము గను ఉత్తరీయము మీఁద ఉత్తరీయముగను ఆరోపింపబడుట వలన నిది అభేదరూపకాలంకార మగుచున్నది. ఆత్మశోభచేత ముఖ – వక్షోజములను

వ్యాపించియున్న తెల్లని చిరునవ్వు యొక్క ప్రసన్నత – హృదయవ్యధను తొలఁగించుటకు సమర్థమగునని భావము.

మూ॥ గిరిశాఙ్గరాగ భసితం స్వాగతవచసాభినన్దదా దరతః
గిరిజాలీలాహసితం గరీయసీం మేతనోతుధియమ్॥ 20

శివాంగరాగమగు (శివుని మెయిపూతయగు) భస్మమును స్వాగతవచనముతో నాదరపూర్వకముగా అభినందించుచున్న పార్వతీ లీలాహసితము నాయొక్క బుద్ధిని గొప్పదిగా విస్తరించును గాత!

ప్రభ:- శివదేవుఁడు తన దేహమునకుఁ బూసికొన్న భస్మమును ''దయచేయుఁడు– మీకు విజయమగుఁగాక'' అను స్వాగత వాక్కుతో నామోదించుచున్నది వలెనున్న పార్వతీ విలాసస్మితము – నా బుద్ధిని విస్తరింపఁజేయుఁగాతమని ప్రార్థింపఁబడినది. భర్తయగు శివుని యొక్క బూదిపూతచేనగు శరీర ధవళిమను జూచి– శుభ్రమగు పార్వతీహాసము కూడ నిజధవళిమతోడి పోలికవలన దానియందాదరమును జూపుచున్నదను వస్తువు చేత నిచట– భసిత– హసితములకు నుపమధ్వనింపఁ జేయఁబడుచున్నది.

మూ॥ దయితేనసల్లపన్త్యాః, సహతుహినమరీచి శిశు కిరీటేన।
వాగమృతబుద్బుదోఽవ్యాదలసో మామగభువోహాసః॥ 21

బాలచంద్రకిరీటియగు భర్తతోఁగూడి సల్లాపములాడుచున్న పార్వతీ దేవియొక్క వాగమృతబుద్బుదమగు అలస (మంద) హసితము నన్ను రక్షించునుగాత!

ప్రభ:- మూలమునందలి ''తుహినమరీచి శిశుకిరీటేన'' అను పదమునకు ''శిశుః = బాలః! తుహినమరీచిః = హిమాంశుః = తుహినమరీచిశిశుః, మయూరవ్యంసకాదిత్ సమాసః'' అని ప్రభావ్యాఖ్యాత చేత వ్యుత్పత్తి చెప్పఁబడినది.

కాంతుఁడగు చంద్రచూడునితో ప్రియభాషణము నొనరించుచున్న దేవీ వాక్కు నుండి బయలువెడలుచున్న మందహాసము – అమృతబుద్బుదమేయను నభేదాధ్యవసాయు వలన రూకాలంకార మగుచున్నది. మథించుట వలన అమృతమునకు బుద్బుదాకారములు కాన్పించును. బుద్బుదమను పదము యొక్క అర్థసామర్థ్యము వలన సల్లాపమును విడువని హాసము ఆక్షేపింపఁబడుచున్నది. స్పష్టముగాఁగనుపించుచున్నను గూడ బుద్బుదము మథింపఁబడుచున్న యమృతము నాశ్రయించి యుండునట్లు – సల్లాపించుచున్న తత్కాలమున నిర్గతమగు మందహాసము – సల్లాపశ్లిష్టమగుచుండునని గ్రహించునది.

మూ॥ శుద్ధః కుచాద్రినిలయా దపి ముక్తాహారతో హరపురన్ధ్ర్యాః
వదన శ్రీప్రాసాదే విలసన్ హాసోఽలసోఽవతుమామ్॥ 22

హరపురంధ్రియగు పార్వతి యొక్క కుచాద్రినిలయమగు ముక్తా హారము కంటెను గూడ స్వచ్ఛమును, వదనశ్రీ ప్రాసాదమునందు విలసిల్లునదియు, అగు మందహాసము నన్ను రక్షించునుగాత!

ప్రభ:- హరపురంధ్రియన శివకాంత, కుచాద్రినిలయము = స్తనమను పర్వతము నివాసస్థలముగాఁగలది. వదనశ్రీ ప్రాసాదమునందు = ముఖలక్ష్మి యొక్క మందిరమునందు, లేక ముఖపద్మమునందు, పర్వతము మీఁదనున్న మేడయే అసాధారణమగు రామణీయకమును పోషించుచుండగా ఆమేడయందు విలసిల్లుచున్న లావణ్యాతిశయమును గురించి చెప్పవలయునా? వక్షోజగతమగు ముక్తాహారము కంటెను గూడ శుభ్రమగు శోభచేత పార్వతీ ముఖపద్మము నందలి హాసము – మిక్కిలి గొప్పదగుచున్నదని భావము.

మూ॥ వ్యర్థీభూతేచూతే గతవతి పరిభూతి మసిత జలజాతే
అనితే సిద్ధిమశోకే కమలేఽపి గలజ్జయ శ్రీకే॥ 23

మన్మథపంచ బాణములయందలి బాణ – పుష్పమగు రసాలము విఫలముకాఁగా, నీలోత్పలము తిరస్కృతినొందగా, అశోకము – లక్ష్య భేదసిద్ధిని సంపాదింపక, పోఁగా, కమలము – గలజ్జయ శ్రీకము (జయశ్రీ నుండి జారినది) కాఁగా.

ప్రభ:-గలత్ = జారిన, జయశ్రీకము = విజయలక్ష్మి గలది – విజయము పొందలేనిది. మీదిశ్లోకముతో నన్వయము.

మూ॥ బహుధా బిభేదహృదయం హరస్య బాణేన యేన సుమభాణః
తదుమా లీలాహసితం మల్లీసుమస్తుమేభూత్యై॥ 24

సుమబాణుఁడగు మన్మథుడు – ఏ బాణము చేత హరుని హృదయమును బహు విధమగునట్లు భేదించెనో, ఆ – ఉమాలీలా హసితమగు మల్లీసుమము – నాకైశ్వర్యము నొసఁగుఁగాత!

ప్రభ:- మల్లీసుమము = మల్లెపూవు, చూతాదులగు బాణపుష్పములు నాలుగును హరహృదయభేదనమున విఫలములు కాఁగా, ఉమాహసితమే – అయిదవబాణమగు మల్లెపూవు యొక్క కార్యమును నిర్వహించెనని కవి ప్రౌఢోక్తి. పూవులయి దింటిలోను గూడ మల్లెపూవునకే అల్పమగు నా కృత్తిచేతను, శుభ్రత చేతను మందమును శుభ్రమును అగు ఉమాహసితము తోడి యభేదము నధ్యవసించుట యుక్తమగును.

మూ॥ అమలదరస్మితచిహ్నాస్తా ఏతాః, సర్వమఙ్గలా ఆర్యాః
కమనీయతమాస్వసమా ముపతిష్ఠ న్తా ముమాందేవీమ్॥ 25

నిర్మల దరహసిత చిహ్న(ము) లును, సర్వమంగల(ము)లును; అగు ఆయీయార్యలు – కమనీయతమలగు స్త్రీలయందు అద్వితీయయగు ఉమాదేవి నుపాసించుఁగాత!

ప్రభ:- సర్వమంగల(ము)లు = స్తబకశ్లోకములందంతటను కల్యాణము గలవి. కలవారు ఆయీయార్యలు = ప్రస్తుత స్తబకమునం దుపక్రమింపఁబడిన ఆర్యా వృత్తనిబద్ధములగు స్తుతులు. ఆర్యలగు స్త్రీలు స్తబకమునందలి శ్లోకములన్నిటి యందును. మందస్మితమును గూర్చియే ప్రస్తావించుట వలన నీయార్యలకు మందస్మితమే చిహ్నమగుచున్నది. అంతటనుగూడ మాంగల్యమునే ఆశాసించుట వలన నీయార్యలు సర్వమంగల లగుచున్నవి.

తృతీయ శతకమునందలి ప్రథమస్తబకము ఇట్లు – ఆర్యల చేత ఉమాదేవతనుపాసించి యుపసంహరింపఁబడి ముగిసినది.

ఇది సవ్యాఖ్యమగు ఉమాసహస్ర తృతీయ శతకమునందలి
ప్రథమ స్తబకము
శ్రీ. శ్రీ. శ్రీ.

****

ఓం నమోభగవతే శ్రీ రమణాయ

ఉమాసహస్రము

(తృతీయ శతకమున – ద్వితీయ స్తబము)

దశమ స్తబకము

అవ:- ఈ దశమ స్తబకము భగవతి యొక్క కేశాది – పాదాంత స్తుతిపరము.

మూ॥ సజ్జాలనాయహరితాం, విభూతయే
లోకత్రయస్య, మదనాయ ధూర్జటేః
కాత్యాయనీవదనతః శనైః శనైః
నిర్యన్తి శుభ్రహసితాని పాన్తునః॥ 1

దిశలను విమలీకరించుటకును, లోకత్రయమునకును, విభూతినిచ్చుటకును, ధూర్జటికి కామముఁగలిగించుటకును కాత్యాయనీ వదనము నుండి మెల్లమెల్లగా బయలువేడలుచున్న తెల్లనిచిరునవ్వులు – మమ్ము రక్షించుగాత!

ప్రభ:- విభూతియన నైశ్వర్యము, ధూర్జటియన శివుఁడు నైర్మల్య– ఐశ్వర్య సాహచర్య సంపాదకములగు భగవతీ మందహాసములు – అస్మద్రక్షకములుగాఁ బ్రస్తుతింపబడినవి. ఇందు – హేతుమండలములగు దిశలను విమలీకరించుట మున్నగు కార్యములతోఁగూడ హేతువగు శుభ్రహసితములను వర్ణించుట వలన నిది హేతువను నలంకారమగుచున్నది. మఱియు – ఆ శుభ్రహసితములు దిశలను విమలీకరించునవిగను, లోకత్రయమునకు విభూతి నిచ్చునవిగను, ధూర్జటికి కామము